


• తక్కువగా నీటిని పోస్తున్న బోరుమోటార్



• నార్నూర్ మండలం రాజులగూడలో పూర్తిగా అడుగంటుక పోయి కనిపిస్తున్న చెరువు

- జిల్లాలో దారెత్తిస్తున్న ఎండలు
- ఆందోళనకరంగా భూగర్భ జలాలు
- గాదిగూడలో అత్యధికంగా 18.35 మీటర్ల లోతులోకి
- జిల్లా సగటు భూగర్భజల మట్టం 8.82 మీటర్లు

పొంచి ఉన్న ముప్పు!



గ్రౌండ్ వాటర్.. డేంజర్ బెల్స్!

ఆదిలాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దారెత్తిస్తున్న ఎండలతో భూగర్భ జలమట్టం పడి పోవడం గుబులు పుట్టిస్తోంది. ఈ యేడు వేసవి ప్రారంభం నుంచే భూగర్భజలాలు పాతాళానికి పడిపోవడం ఆందోళన రేపుతోంది. ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లోనైతే పరిస్థితులు మరీ దారుణంగా కనిపిస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం గిరిజనం కిలోమీటర్ల కొద్ది కాలినడకన వెళ్లి తాగునీటిని తీసుకొచ్చుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఈశాన్య రుతుపవనాల ప్రభావం వలన డిసెంబర్‌లో వర్షపాతం నమోదుకాక పోవడంతో ఈ యేడు వేసవి ప్రారంభంలోనే తాగు, సాగునీటికి కటకట మొదలైంది. కాగా, వేసవి తీవ్రత ఇలానే కొనసాగితే భూగర్భ జలాలకు మరింత ముప్పు పొంచి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రెండు మీటర్లకు పైగా పడిపోయిన జలాలు..

జిల్లా సాధారణ వర్షపాతం 1193 మి.మీలు కాగా ఈ సారి అధికంగా 1280మి.మీల వర్షపాతం నమోదైంది. దీంతో ఏప్రిల్ చివరి నాటికి జిల్లా సగటు భూగర్భజల మట్టం 8.82మీటర్లకు పడిపోయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలిసింది. అలాగే అత్యధికంగా గాదిగూడ మండలంలో 18.35 మీటర్లు, గుడిహత్నూర్‌లో 14.50 మీటర్లు, బోరజ్‌లో 14.10, ఇంద్రవెల్లిలో 13.10 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు అడుగంటుక పోయాయి. గడిచిన నాలుగు మాసాల్లోనే రెండు మీటర్లకు పైగా భూగర్భ జలాలు పడిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాలో 45 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో భూగర్భజలాలు మరిం త పడిపోయే అవకాశం ఉంటుంది. మే గడిచి పోతే వేసవి పరిస్థితులను గట్టెక్కినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందు చూపు లేక పోతే ముప్పుతప్పదన్న హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఏప్రిల్‌లోనే రెడ్ అలర్ట్..

ఈ యేడు ఏప్రిల్ మాసంలోనే జిల్లాలో రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 24న అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు 45.2 డిగ్రీలునమోదయ్యాయి. దీంతో భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయి. మే మాసంలో మాడుపగిలే ఎండలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ మాసాన్ని గట్టెక్కితే వేసవి పరిస్థితుల నుంచి బయట పడినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇచ్చోడ మండలాన్ని డ్రై ప్రాంతంగా ప్రకటించారు. అలాగే గాదిగూడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, బోరజ్, ఉట్నూర్, సిరికొండ మండలాల్లో భూగర్భజలాలు ప్రమాదకర పరిస్థితుల్లో కనిపిస్తున్నాయి. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నదిలో నీటి ప్రవాహం పూర్తిగా అడుగంటుక పోవడంతో పరీవాహక ప్రాంతంలోని మండలాల్లో నీటి ఎద్దడి సమస్య కనిపించింది. మరో నెల రోజుల పాటు అప్రమత్తంగా ఉంటేనే జల ముప్పు తప్పుతుందంటున్నారు. ఇప్పటికే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను తీసుకుంటున్న గిరిజనులు తాగు, సాగునీటికి అల్లాడుతున్నారు. గుక్కెడు నీటి కోసం కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది. ఈ యేడు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శీతాకాలంలో కనిస స్థాయిలోను వర్షపాతం నమోదు కాలేదు. దీంతో వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలం వేగంగా పడిపోవడం కనిపించింది.

వర్షపు నీటికి అడ్డుకట్ట ఏది..

జిల్లాలో కొండ ప్రాంతాలు ఎక్కువ కావడం, అలాగే నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో వర్షపు నీరు భూగర్భ జలంగా మారడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు నల్ల రేగడి నేలలు అనువైనవి కాక పోవడమే అసలు కారణమంటున్నారు. దీనికి తోడు జిల్లాలో ఎక్కువగా సాగు నీటి ప్రాజెక్టులు కూడా లేక పోవడం నీటి నిల్వలకు అవకాశం లేదంటున్నారు. జిల్లా భూ ఉపరితలం ఎత్తు పల్లాలతో కూడుకుని ఉండడంతో వర్షపు నీరు వేగంగా దిగువకు జారీపోతుంది. ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు, కందకాలను తవ్వుతున్న ఒకటి రెండేళ్లలోనే పూడిక మట్టి పేరుక పోయి నేలమట్టమవుతున్నాయి. దీంతో నీటి నిల్వకు అవకాశమే లేకుండా పోతోంది. భూగర్భజలాలను పెంపొందించేందుకు చెక్ డ్యామ్‌లను నిర్మించి మరిన్ని కందకాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భూగర్భజలాల పెంపు నకు అధికార యంత్రాంగం పలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రతిఒక్కరూ ఇంటి నిర్మాణ సమయంలో ఇంకుడు గుంతలను నిర్మించాల్సి ఉంటుంది. ఇంకుడు గుంతను ఏర్పాటు చేస్తేనే ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇలాంటి నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదు. ప్రతి యేటా జిల్లాలో నీటి ఎద్దడి పరిస్థితులు నెలకొంటున్న అధికార యంత్రాంగం మాత్రం శాశ్వత పరిష్కారాన్ని చూపడం లేదంటున్నారు.

ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి..

: శ్రీవల్లి (భూగర్భజల శాఖ అధికారి, ఆదిలాబాద్)

జిల్లాలో ప్రతి యేటా పడిపోతున్న భూగర్భ జలాలను కాపాడుకోవడానికి ఉదృతంగా చెక్‌డ్యాంల నిర్మాణాన్ని చేపట్టాలి. అలాగే ప్రతి పొలంలో గుంతలు, కందకాలు ఏర్పాటు చేసుకోవాలి. వర్షాకాలంలో తగు చర్యలు చేపడితేనే వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా ఉంటుంది. ఇప్పటి నుంచే పొదుపుగా నీటిని వాడుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు దూరమవుతాయి. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉంటేనే అధికారులు ఇంటి అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటే పరిస్థితులు కొంత మేరకు మెరుగు పడుతాయి.

బోరన్నీ ఎండిపోతున్నాయి..

: మడావి మాన్కు (రైతు, భీంపూర్)

మునుపెన్నడూ లేనివిధంగా ఈ యేడు వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో పంటలను సాగు చేసేందుకు అవకాశమే లేకుండా పోతుంది. వేసిన పంటలను రక్షించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. గతంలో పది స్పింక్లర్లు నడిచే బోర్లు ప్రస్తుతం ఐదారు స్పింక్లర్లే నడుస్తున్నాయి. బోరుబావుల మీదనే భరోసా పెట్టుకుని పంటలను సాగు చేస్తున్నాం. పరిస్థితులు గందరగోళంగా మారాయి. వేసిన పంటలు అసలు చేతికి వస్తాయో రావో భరోసానే లేకుండా పోయింది.

500 ఫీట్ల వరకు వేయాల్సి వస్తోంది..

: పన్నెంటె సుభాష్ (ఇచ్చోడ మండలం)

భూగర్భజలాలు అడుగంటుక పోవడంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. 500ల ఫీట్ల వరకు బోరుబావులను తవ్వాల్సి వస్తుంది. అయిన ఆశించిన స్థాయిలో నీళ్లు రావడం లేదు. దీంతో నీటి ట్యాంకర్ల పైననే ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పటికే ఇచ్చోడ మండలాన్ని డ్రై మండలంగా ప్రకటించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి సమస్య ఎదురవుతుంది. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాక పోవడంతో స్థానికంగా వ్యవసాయ, బోరుబావుల పైననే ఆధారపడాల్సి వస్తుంది.

డివిజన్ టాపర్లను సన్మానించిన సబ్‌కలెక్టర్



విద్యార్థులను సన్మానిస్తున్న సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్

ఉట్నూర్,మే1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో డివిజన్ టాపర్‌గా నిలిచిన సన్‌షైన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులను ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్ గురువారం సన్మానించారు. అత్యుత్తమ మార్కులు సాధించి డివిజన్ టాపర్లుగా పదోతరగతిలో నిలిచిన మూగల అశ్విత 575 మార్కులు, రాథోడ్ వంశీ 571 మార్కులు, పవార్ ఆదిత్య 568 విద్యార్థులను అభినందించారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని ఉట్నూర్‌లో పదోతరగతి పరీక్ష ఫలితాల్లో డివిజన్ టాపర్‌గా సన్‌షైన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని సబ్‌కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ సాడిగే రాజగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆశ్రమ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతులపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా డీఈలకు మరియు ఏఈలకు ఆశ్రమ పాఠశాలలో మరియు ఏజెన్సీ గ్రామాలలో చేపట్టుతున్న మరమ్మతుల గురించి ఎంత వరకు పూర్తి చేశారని తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాల గేట్ల మరమ్మత్తుల గురించి తెలుసుకునిఅసంపూర్తిగా ఉన్న గేట్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పని చేయని ఆర్‌ఓ ప్లాంట్లకు మరమ్మత్తులు చేయించాలని సూచించారు. అంతేకాకుండా భోజన శాలలు, భవనాల షెడ్లు నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. మిగిలిన నిధులతో అవసరమైన ఆశ్రమ పాఠశాలలో వాచ్‌మెన్ గదులను నిర్మించాలని తెలిపారు. వసతి గదుల, తరగతి గదుల మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయించి అప్పగించాలని సూచించారు. కిటికీలు, విద్యుత్ తలుపులు రిపేరు చేయించాలని డీఈ, ఏఈలకు ఆదేశించారు. అదనపు తరగతి గదులను నిర్మించాలని అన్నారు. అంగన్‌వాడీ, మోడల్ స్కూల్, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు, డార్మెట్రి గదుల నిర్మాణ మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరు అధికారులకి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బర్త్ వెయిటింగ్ గదుల నిర్మాణాలని మొదలు పెట్టాలని అధికారులకు తెలిపారు. పాఠశాలలకు సెలవులు ముగియక ముందే అసంపూర్తిగా ఉన్న మరమ్మత్తులను నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీర్ అధికారులకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాదవ్‌తానాజి, దేలు శివప్రసాద్, సతీష్ దేశ్‌పాండే, ఉమ్మడి జిల్లా ఏఈలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలలో 99శాతం ఉత్తీర్ణత...

ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి 2025 ఫలితాల్లో గిరిజన విద్యార్థులు 99శాతం ఉత్తీర్ణత సాధించారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. గత సంవత్సరంలో 2024- 96.33 శాతం ఫలితాలు రాగా ఈ సంవత్సరం 3 శాతం ఉత్తీర్ణత పెరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 గిరిజన బాల బాలికల గురుకులాల్లో బాలికలు 595 పరీక్ష రాయగా అందులో 591 ఉత్తీర్ణత సాధించారని, బాలురు 260 మంది పరీక్ష రాయగా అందులో 253 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ విజయం సాధించడానికి మిషన్ లక్ష్యం అనే కార్యక్రమాన్ని ప్రత్యేకించి గురుకులాల్లో అమలు చేయడంతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. ప్రిన్సిపాల్లు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఎంతో కృషితో విజయం సాధించారని, ఉత్తమ ఫలితాలు రావడంతో ఆర్‌సీఓ ఆగస్టియన్‌ను అభినందించారు.

కార్మికులను సన్మానించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



కార్మికులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): మే డే సందర్భంగా కార్మికులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో (శ్రమజీవులు) కార్మికులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఎన్ని సాంకేతిక పరిజ్ఞానం కూడిన యంత్రాలు వచ్చిన ప్రపంచ మనుగడకు మూలం శ్రమశక్తి అని అన్నారు. వెలకట్టలేని కార్మిక శ్రమను అందరం గౌరవిద్దాం, రేయింబవళ్లు శ్రమించే శ్రామికులకు గౌరవమిద్దాం అందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ శివ రెడ్డి, అనిల్ అన్న యువ సైన్యం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, విడిసి అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పండరి, బాబులాల్, రాందాస్, తదితరులు ఉన్నారు.

ఏపీ డిప్యూటీ సీఎంపై కంది అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఆదిలాబాద్ రూరల్, మే 01 (ఆంధ్రజ్యోతి) : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ప్రతి భారతీయులు ఖండిస్తుంటే కాంగ్రెస్ నాయకులు అనుకూల వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనసేన పార్టీ ఇన్‌చార్జి సైదల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ విమర్శలుగా తీసుకోవద్దని, వీటిపై విమర్శించే ముందు ప్రజాసమస్యలపై దృష్టి పెడితే మంచిదని తెలిపారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేయాలి

● ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, మే 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం వార్డ్ ఆఫీసర్లతో మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల పథకంపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందే విధంగా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనర్హులు ఉంటే వారిని తొలగించి అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు.

జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదం

- ఒకరి మృతి, 15 మందికి గాయాలు
- పశువులు అడ్డురావడంతో బస్సును ఢీకొట్టిన లారీ
- డ్రైవర్ చాకచాక్యంతో తప్పిన పెనుప్రమాదం



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు



బోల్తాపడిన ట్యాంకర్

ఇచ్చోడ, మే1, (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై పశువులు అడ్డురావడంతో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన ఇచ్చోడ మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోకస్మనూర్ వెళ్లే దారి వద్ద జాతీయ రహదారిపైకి ఆకస్మాత్తుగా నాలుగు పశువులు డివైడర్‌ను క్రాస్ చేసుకుని ఆర్టీసీ బస్సు ఎదురుగా రావడంతో డ్రైవర్ బస్సును కంట్రోల్ చేసుకున్నాడు. బస్సు వెనుక వస్తున్న ట్యాంకర్ లారీ ఒక్కసారిగా బస్సును ఢీకొట్టడంతో బస్సు కొంత దూరం వరకు వెళ్లి డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. బస్సును ఢీకోన్న లారీ ఆటోను, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఆటో అదుపుతప్పింది. ద్విచక్రవాహనం టీవీఎస్ ఎక్స్‌ఎల్ సైతం అదుపు తప్పి కిందపడడంతో బస్సులో ప్రయాణిస్తున్న జైనథ్‌కు చెందిన మేకల భీమక్క(55) చికిత్స పొందుతూ మృతి చెందింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు, ఆటోలో ఉన్న ప్రయాణీకులు, ద్విచక్రవాహనదారులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలంలో నాలుగు పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. ఆటోలో ప్రయాణిస్తున్న షెక్ జహీర్, జానిద్, రీష్మా, సఫీయాబేగం, సహిస్తారుక్సానా, జుబీయాఫిర్దోస్, బస్సులో ప్రయాణిస్తున్న పవార్ పులాబాయి, లక్ష్మి, మౌనిక, అజీజ్, ఎక్స్‌ఎల్‌పై ప్రయాణిస్తున్న పవార్ నాందేవ్, విక్రమ్‌లకు తీవ్ర గాయాలవ్వడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న ప్రయాణీకులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు 64 మంది ప్యాసింజర్‌తో నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై ప్రయాణీస్తున్న క్రమంలో ఇచ్చోడ మండలంలోని కొక స్మనూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఆకస్మికంగా పశువులు అడ్డు వచ్చాయి. పశువులు అడ్డు రావడంతో బస్సు డ్రైవర్ బస్సును ఆపే ప్రయత్నం చేశారు. బస్సు నెమ్మది చేసే క్రమంలో నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ బస్సును వెనుకనుంచి బలం గా ఢీకొట్టడంతో బస్సు డివైడర్‌పైకి ఎళ్లి ఆగిపో యింది. రోడ్డు దాటుతున్న నాలుగు ఆవులను తప్పిం చబోయిన బస్సు ఒక ఆవును ఢీకొట్టింది. తప్పించు కున్న మరో మూడు పశువులపైకి లారీ దూసు కెళ్లింది. లారీ అతివేగంగా ఉండడంతో కంట్రోల్ తప్పిన లారీ కుంటాల నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆటోపైకి, సాథ్‌నంబర్ నుంచి ఇచ్చోడకు వస్తున్న ఎక్స్‌ఎల్‌ను ఒకదాని తరువాత ఒకదాన్ని ఢీకొని రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టి లారీ బొల్తాపడింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుకభాగం మొత్తం, ఆటోనుజ్జునుజ్జు అయ్యాయి. సంఘటన స్థలంలో సర్కిల్ సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి ట్రాఫిక్‌ను క్లియర్‌చేసి రోడ్డు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రత్యేక కృషి

● చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు



ముఖ్యకార్యదర్శిని సన్మానిస్తున్న గోక గణేష్‌రెడ్డి

తలమడుగు , మే 1 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఆదిలాబాద్ ఆదివాసీ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. గురువారం హైదరాబాద్ సెక్రటేరియేట్‌లో తెలంగాణ రాష్ట్ర నూతన చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు తీసుకున్న కె.రామకృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కలిసి గతంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. అదే విధంగా ఆదిలాబాద జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గణేష్‌రెడ్డి సీఎస్‌తో మాట్లాడుతూ వెనుకబడ్డ ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు.

క్యాంప్ ప్రారంభం

భీంపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాంప్‌ను మండల విద్యాశాఖ అధికారి శ్యామ్‌సుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యం పెంపునకు దోహదపడుతుందన్నారు. వేసవిలో విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంపల ప్రభాకర్, ఉష్కం తిరుపతి, రాహుత్ సురేష్, గుమ్మడి రవీందర్‌రెడ్డి, విలాస్, శ్రీ శుభం సీఆర్‌పీలు రవీందర్, చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, మే 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ చత్తీస్‌గఢ్ మర్యాదలలో అమాయక ఆదివాసీ ప్రజలను మావోయిస్టుల పేరుతో దాడి చేయడానికి ఖండిస్తున్నామని తెలిపారు. మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, మనోజ్, ఇందిరా, వరుణ్, రేణుక, పాల్గొన్నారు.

పేదల రాజ్యం కోసమే మా భూమి రథయాత్ర

● బీసీ, ఎస్సీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్



గురుజలో బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

గుడిహత్నూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీలు అగ్రకులాల పేదల రాజ్యం కోసమే లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర చేపట్టినట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని సీతాగొంది కమలాపూర్‌కు మా భూమి రథయాత్ర చేరుకుంది. ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో పేదరికం కరువు తాండవిస్తోందని విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఏది ప్రజలకు అందడం లేదన్నారు. ప్రభుత్వానికి చాలా దూరంలో ఈ జిల్లా ఉందని అందుకే ఆదిలాబాద్ జిల్లా నుంచి రథయాత్రను ప్రారంభించినట్లుగా తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను కేవలం ఓట్లు వేసే బానిసలుగా మాత్రమే చూస్తున్నాయని, తెలంగాణలో పది శాతం లేని రెడ్డి, వెలమ అగ్రకుల పాలకులను దింపి అనాగరిన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాన్ని మా భూమి రథయాత్ర ద్వారా తీసుకొస్తామని తెలిపారు. ఇది అందరి కోసమని రాజకీయాల కతీతంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీలో పాల్గొనాలని కోరారు. గురువారం మండలంలోని గురుజ గ్రామంలో కిడ్నీ బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర నాయకుడు అన్నెల లక్ష్మణ్, జిల్లా కోఆర్డినేటర్ అగిమల్ల గణేష్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు దోమ్మటి సురేష్, రామచందర్, నవీన్, పాల్గొన్నారు.

భర్త మందలించాడని.. భార్య ఆత్మహత్య

ఉట్నూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని నాగోబా గూడాలో భర్త మందలించడంతో భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఉట్నూర్ ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. ఉట్నూర్ మండలంలోని నాగోబాకు చెందిన సోయం అనసూయ (28)కు మత్తడిగూడకు చెందిన ఆత్రం రమేష్‌తో పదేళ్ల క్రితం వివాహం అయింది. గత నెల 29న కుమారుడు అల్లరి చేస్తుంటే తల్లి అనసూయ కుమారుని కొట్టింది. దీంతో తండ్రి రమేష్ చిన్న పిల్లల్ని ఎందుకు కొడుతున్నావంటూ తల్లి అనసూయను మందలించాడు. దీంతో క్షణికావేశానికి లోనైనా అనసూయ ఎలుకల మందు తాగడంతో హుటాహుటిన ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ తరలించి వైద్యం అందిస్తుండగా గురువారం మృతి చెందింది అన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం
రాష్ట్ర అధ్యక్షుడిగా ఉట్నూర్ ఐటీడీఏ పీహెచ్‌ఓ ఎన్నిక



పీహెచ్‌ఓ సందీప్‌ను అభినందిస్తున్న సంఘం సభ్యులు

ఉట్నూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అధికారుల సంఘం (టీజీహెచ్‌ఓఎస్) రాష్ట్ర అధ్యక్షులుగా ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి (పీహెచ్‌ఓ) సందీప్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉద్యానశాఖ చరిత్రలో మొట్ట మొదటిసారి హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో గుడిమళ్ల సందీప్‌కుమార్ గురువారం ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం భవనంలో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, కార్యదర్శి సత్యనారాయణ, ఎన్నికల అధికారి శ్రీరామ్‌రెడ్డి, సహాయ ఎన్నికల అధికారి శ్రీనిష్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో సందీప్ కుమార్ విజయం దక్కించుకున్నారు. తదుపరి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు చేతుల మీదుగా సందీప్‌కుమార్, ఇతర సభ్యులు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా విద్యాసాగర్ (నల్గొండ(, సహా అధ్యక్షులుగా అనంత్‌రెడ్డి (నల్గొండ), కోశాధికారిగా జలంధర్ (జీడిమెట్ల) మహిళ అధ్యక్షురాలిగా అనితశ్రీ (ఖమ్మం) గెలుపొందారన్నారు. అనంతరం నూతనంగా గెలిచిన ఉద్యాన అధికారుల సంఘం సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో టీజీఓ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ,శ్రీరామ్‌రెడ్డి, శ్రీనిష్ తదితరులతో కలిసి ఉద్యానశాఖ సంచాలకులు యాస్మిన్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిసి క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉద్యాన అధికారుల సంఖ్యను రెట్టింపు చేయాలని ఉద్యాన విస్తరణ అధికారులపోస్టులు క్రియేట్ చేసి భర్తీ చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు చేపట్టాలని, క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న హెచ్‌ఓలకు వాహన సదుపాయం కల్పించాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ మేరకు సంచాలకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ ఉద్యాన అధికారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకొని వెళ్త వాటికి పరిష్కారం లభించేలా ప్రయత్నం చేస్తామని ఉద్యాన అధికారుల సంక్షేమం కోసం ప్రయత్నం చేస్తా అని స్పష్టం చేశారు.

తెలంగాణలో
బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తా


● మాజీ మంత్రి జోగు రామన్న



రాంపూర్ టిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, మే1 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్రమాజీ మంత్రి బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల, బోరజ్, బోథ్‌లో సోనాల మండలాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. గురువారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల మండలంలోని రాంపూర్ గ్రామాలలో అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.దీంతో పాటు రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్నకు పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మాంగుర్ల మాజీ ఎంపీటీసీ పి.దేవన్నలతో పాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ , మే 1 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.2,48,000ల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. వీరితో పాటు తాంసి మండలంలోని గిరిగామ గ్రామానికి చెందిన భూమన్నకు రూ. రెండు లక్షల రూపాయల ఎల్‌వోసీని సైతం ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

'నీటి సమస్య ఉంటే ఫోన్ చేయండి'

మావల, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో నీటిఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అందుకు సామాజిక బాధ్యతగా నీటి లారీట్యాంకర్‌ను ఏర్పాటు చేశామని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని దస్నాపూర్ తన ఇంటి ఆవరణలో నీటి లారీట్యాంకర్‌కు ప్రత్యేకపూజలు చేసి ప్రారంభించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా నీటి ఎద్దడి ఏర్పడిందన్నారన్నారు. ఈ మేరకు నీటిసమస్య పరిష్కారానికి దాదాపు 20 వేల లీటర్ల కేపాసిటీ గల మంచినీటి ట్యాంకర్ ఉచిత సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఒక్క కాల్ చేయండి ఎక్కడ నీటి సమస్య ఉన్న కాలనీలకు, చుట్టు ప్రక్కల గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటి పంపిణీ ఉచితంగా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో భగవాన్ రావు, మాజీ కౌన్సిలర్ కృష్ణయాదవ్, అనిల్, కోరెడ్డి తిరుపతి, బండారి దేవన్న, సురేందర్ రెడ్డి, ఆశన్న యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా మే డే ఉత్సవాలు

● ఆదిలాబాద్ జిల్లా అంతా రెపరెపలాడిన ఎర్రజెండా ● కార్మికుల హక్కులను గుర్తు చేసిన నాయకులు



ఉట్నూర్ గ్రామ పంచాయతీ ముందు జెండా ఎగురవేసిన కార్మికులు



పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్, మే1 (ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ మండలంలో గురువారం కార్మిక సంఘాలు, అనుబంధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. తమ తమ గద్దెల వద్ద కార్మిక సంఘాల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద బేవరేజ్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మేడే జెండాను బేవరేజ్ హమాలీ యూనియన్ జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జుఆశన్న మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మేడే సంబరాలు నిర్వహించుకుంటున్నామన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద జెండా ఆవిష్కరించామన్నారు. కార్మికులకు, కర్షకులకు ప్రజలకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఆనాడు చికాగో నగరంలో కార్మికుల రక్తంతో పుట్టిన ఎర్రజెండా పండుగ ఘనంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్మికుల అనేక పోరాటాల ఫలితంగా ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్న కార్మికులు మేడేగా జరుపుకుంటుమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను మేడే స్ఫూర్తితో 4లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీల, ఆశాగ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో బేవరేజ్ హమాలీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆడే శంకర్, పి.ధర్మం, ఉపాధ్యక్షులు బి.శంకర్, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రావు, బేవరేజ్ హమాలీ యూనియన్ నాయకులు తిరుమలేష్, దేవరావు, బుచ్చిరెడ్డి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులను సన్మానించిన ఆత్రం సుగుణ

ఇదిలా ఉండగా కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకు వెళ్లదని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రంసుగుణక్క అన్నారు. గురువారం ఉట్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవం వేడుకల్లో సుగుణక్క పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులను సుగుణక్క - భుజంగరావు దంపతులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ చట్టాలను ఉప సంహరించుకోవాలి

ఆదిలాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి):కార్మికులను శ్రమదోపిడికి గురి చేసే లేబర్ కోడ్ చట్టాలను ఉప సంహరించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, వి.అశోక్‌లు డిమాండ్ చేశారు. గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా జిల్లా కార్యాలయం ఎదుట టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు సి.లక్ష్మణ్‌రావ్ పతాకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమదోపిడికి వ్యతతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు సమిష్టిగా ఉద్యమించాల న్నారు. ఉద్యోగులను శ్రమదోపిడికి గురిచేసేలా రూపొందించిన యూపీఎస్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని, ఉద్యోగుల కుటుంబాలకు శాపమైన సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యకుమార్, కోశాధికారి కె.శ్రీనివాస్, కార్యదర్శులు ఎ.స్వామి, కె.గణేష్, సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

మే డే స్ఫూర్తిని నేటి పాలకులు కాలరాస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ విమర్శించారు. గురువారం మే డే సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ 139 ఏళ్ల కింద కొట్లాడి సాధించుకున్న 8గంటల పని దినాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 12గంటలకు పెంచిందన్నారు. సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కాలరాస్తున్నదని మండిపడ్డారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్,జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఎన్.స్వామి, నాయకులు లంక జమున, కోవే శకుంతల, విజయ, అగ్గిమల్ల స్వామి, కె.ఆశన్న, గంగారాం, గంగాసాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో..

139వ అంతర్జాతీయ మేడేని పురస్కరించుకుని ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు ఎం.నారాయణ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మిట్టపెల్లి భీమ్‌రావ్ 139వ మే డే ప్రాధాన్యతను కార్మికులకు వివరించారు. ఆర్టీసీలో 8గంటల పని దినాలు లేవని రాజ్యాంగ నుంచి సంక్రమించిన స్వేచ్ఛా, స్వాతంత్రం, కార్మికునికి సంఘం పెట్టుకుని మాట్లాడే హక్కే లేకుండా పోయిందన్నారు. నాడు కార్మిక నాయకుల అమరత్వంతో సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను కేంద్ర ప్రభుత్వం కుదించి యాజమాన్యాలకు అనుకూలంగా మార్చిందని పేర్కొన్నారు. వాటిని రక్షించుకోవడానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో జిల్లా అధ్యక్షులు ఎస్.భీమ్‌రావ్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, ఎం.ఆశన్న, డి.రమేష్, పొచ్చన్న, దత్తు, నారాయణ, సురేష్, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో..

ఉట్నూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉట్నూర్ పట్టణంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక్ చౌక్, కేబీనగర్, ఎస్ఆర్ నగర్, కేబీ కాంప్లెక్స్, సాయినగర్, ఎల్బీనగర్, రాంనగర్, విద్యుత్ సబ్‌స్టేషన్ ఆఫీస్, ఎన్టీఆర్‌చౌక్, లక్కారం, రాంజీగోండు నగర్ తదితర ప్రాంతాలలో మేడే వేడుకల సందర్భంగా జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జుగాదిరావ్, సంబాజి, జైల్‌సింగ్, అనంతయ్య, గణేష్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక
లేబర్ కోడ్ల రద్దుకు పోరాడుదాం

● మే డే వేడుకల్లో పలువురు వక్తల పిలుపు ● నిర్మల్ జిల్లాలో ఘనంగా మే డే పతాకాల ఆవిష్కరణ





ఖానాపూర్ తాపీమేస్త్రీ సంఘ భవనంలో జెండా ఆవిష్కరణ

కడెంలో మేడే పతాకాన్ని ఆవిష్కరించిన కార్మిక నాయకులు

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : 139వ మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్ల రద్దుకై పోరాడుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఆయా పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, ఏఐటీయూసీ యూనియన్ నిర్మల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి, కడకుంట్ల రవి, పిట్టల భీమేష్, తదితరులు వేరువేరు ప్రదేశాల్లో మే డే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేసి దేశంలో ఉన్న 50 కోట్ల మంది కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి దేశంలోని కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పును పాలకులు గౌరవించకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్మికవర్గం ఐక్య పోరాటాలు చేసి కేంద్రప్రభుత్వం మెడలు వంచాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. తాపీ మేస్త్రి సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ఖానాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో ఆయా పార్టీలు, కార్మిక సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

టీయూసీఐ ఆధ్వర్యంలో..

నిర్మల్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినం 139వ మే డేను సోఫీనగర్ బీడీ ఫ్యాక్టరీలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ఘనంగా మే డే నిర్వహించారు. ప్యాకింగ్ జిల్లా కార్యదర్శి పోశెట్టి మే డే జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్మికులు ఐక్యంగా పోరాడాలని, 44 చట్టాలను నాలుగు కోడ్లుగా తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని, ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సంపూర్ణంగా విజయవంతం చేస్తామని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, ఎల్లయ్య, లక్ష్మణ్, వెంకటి, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గంధం లింగన్న ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేసి ఒకరికొకరు మే డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు, వ్యవసాయ కూలీ సంఘం సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు రవి, మహారతన్, సాయినాథ్, నారాయణ, నర్సయ్య, బొగ్గుల హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

కడెంలో జెండా ఆవిష్కరణ

కడెం, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మికులు ఏకమైన రోజు మే డే అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్ అన్నారు. కడెం మండల కేంద్రంలో మండల నాయకులతో కలిసి కార్మిక జెండాను ఎగురవేశారు. శ్రామిక దోపిడీ నుంచి శాశ్వత విముక్తి పొందాలని లక్ష్యంతో పోరాటాల ఫలితంగానే కార్మిక దినోత్సవం 8 గంటల పని దినం కోసం చికాగోలో 1986లో ప్రారంభమైన ఉద్యమం ద్వారా కార్మిక హక్కులను సాధించుకున్న దినంగా మే డే అని పిలుచుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వడ్యాల్ గ్రామంలో..

లక్ష్మణచాంద, మే 1 (ఆంధ్రజ్యోతి) : 139వ ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను (మే డేను) మండలంలోని వడ్యాల్ గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న మే డే జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్. లక్ష్మీ, నాయకులు లింగన్న, స్పందన, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి), మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినం 139వ మేడేను నర్సాపూర్(జి) బస్టాండ్ ముందు గురువారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ఘనంగా మేడే నిర్వహించారు. టీయూసీఐ జిల్లా అధ్యక్షులు ఎం. బక్కన్న మే డే జెండాను ఆవిష్కరించి కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఆర్. రామలక్ష్మణ్, దుత్తరాం, ముత్యం, ఎల్లన్న, పోశెట్టి, వహీద్, తదితరులు పాల్గొన్నారు.

● పారిశుధ్య కార్మికులకు సన్మానం

కుభీర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాల్లో మే డేని గురువారం ఘనంగా నిర్వహించారు. కుభీర్ మేజర్ గ్రామపంచాయతీలో మిత్ర మండలి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు మిత్ర మండలి అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు శాలువ పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సట్ల గంగాధర్ మాట్లాడుతూ జీపీ పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు.

కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయం

● మాజీ ఎంపీ సోయంబాపురావు

ఆదిలాబాద్‌అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తలొగ్గిందని మాజీ ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఈ సందర్భంగా గురువవారం మీడియాకు మాజీ ఎంపీ సోయంబాపురావు ఒకప్రకటన విడుదల చేశారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సామాజిక ఆర్థిక, కుల సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఇది దేశానికి రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. కుల గణన ఆధారంగా సామాజిక వర్గాలకు రిజర్వేషన్లతో పాటు వారి హక్కులను కాపాడాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య ఉద్యమంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ విజయంగా పేర్కొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ఉట్నూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ కులగణనతో పాటు జనగణన సర్వే చేపట్టడానికి ప్రకటించడంతో భారతీయ జనతా పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఉట్నూర్‌లో గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతాపార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు.గతంలో ఉన్న బ్రిటీష్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎప్పుడు కూడా జనగణన,కులగణన చేపట్టలేదు అన్నారు. 1937లో ఒకసారి కులగణన, జనగణన చేపట్టిన రికార్డులు మాత్రం భద్రపరచలేదన్నారు. ఈ సర్వేతో దేశంలోని ప్రతి పౌరుడుకి సమానమైన హక్కులు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడే ధనలాల్నాయక్, మాజీ జడ్పీటీసీ సాదిగే గంగన్న, కొండూరి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజి, పవర్‌దేవిదాస్‌నాయక్, సీపతి లింగాగౌడ్, బింగివెంకటేశ్, జగన్‌నాయక్, బానోత్ ఉపేందర్, తొగిటి నాగభూషణం, కాల్వరవి, సాడిగే రాజేశ్వర్, కుటికల ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

మావల, మే 1 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కుల గణన చేయాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నందున నరేంద్రమోదికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోరంచు గంగారెడ్డి, మావల మండల మాజీ అధ్యక్షుడు మిట్టపల్లి రవిరెడ్డి, జిల్లా కార్యదర్శులు కోటగిరి రాకేష్, కొర్రి భూమేష్, మండల కిసాన్‌మోర్చా అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, మండల కోశాధికారి సూర్యకాంత్, బూత్ అధ్యక్షులు బొట్టు ఉశన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి వెడ్మ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ఉట్నూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన సలాది అనిత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని తెలియడంతో వారి కుటుంబానికి వెడ్మఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబ సభ్యురాలు క్యాన్సర్ వ్యాధికి గురైనట్లు తెలుసుకున్న వెడ్మఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఫౌండేషన్ తరపున తనవంతుగా నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇదిలా ఉండగా ఉట్నూర్ మండల కేంద్రంలోని మోమిన్‌పూర కాలనీకి చెందిన సయ్యద్ అలీం ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి పడి గాయపడి ఆర్థిక సహాయం కోసం ఆశ్రయించడంతో వారికి కూడా నగదు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వెడ్మఫౌండేషన్ వైస్ చైర్మన్ కోరెంట అక్షయ్ తదితరులున్నారు.

సెలవుల సర్క్యులర్‌ను వెంటనే విడుదల చేయాలి

ఆదిలాబాద్‌అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి):పోరాటాలు,ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడంతోనే ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తూ కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల సెలవులు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేసిన రాజీలేని పోరాటాల ఫలితంగానే రాష్ట్ర మంత్రి సీతక్క అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవుల ప్రకటన ఇచ్చారని అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అగ్గిమల్ల స్వామి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మల్లికాంబ, మధునిక, కవిత, ప్రియాంక, మనిషా, పద్మ , జయశ్రీ, శకుంతల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి కాల శిక్షణ క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ప్రముఖ వైద్యులు కిరణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వేసవి కాల శిక్షణ క్రీడా శిబిరాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వాలీబాల్, కరాటే, వెయిట్ లిఫ్టింగ్, యోగ, బ్యాడ్మింటన్ లాంటి ఐదు విభాగాల్లో చిన్నారులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ శిబిరాలను నిర్వహిస్తోందని నిర్వాహకులు పీడీ షేక్ ఇమ్రాన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్‌కృష్ణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రవీందర్ గౌడ్, పీఈటీలు రాము, ఇర్ఫాన్, రిజ్వాన్, తదితరులున్నారు.

ఉగ్రదాడికి కారకులను కఠినంగా శిక్షించాలి

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటిస్తున్న పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఖానాపూర్ మున్సిపల్‌కార్మికులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఉగ్రవాద నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ భారత ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉగ్రమూకలను తుద ముట్టించే వరకు ఇటువంటి దాడులు జరుగుతూనే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నర్సాపూర్(జి), మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు రాంపూర్ గ్రామాల్లో డీఆర్‌డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఎంఏ అజీమ్, సాయన్న, నాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారి చెంద్యాల గణేష్, ఇంద్రకరణ్ రెడ్డి, రమేష్, మాజీ ఎంపీటీసీ మల్లేష్, గంగారెడ్డి, ఉమామహేశ్వర్, మాజీ సర్పంచ్ గోవింద్ రెడ్డి, వీడీసీ సభ్యులు రాజు, భూమేష్, ఎంపీడీవో, ఏపీఎం, ఏఈవో, సీసీ, బుక్ కీపర్స్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నర్సాపూర్(జి), మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కొండాపురం మల్లవ్వ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి శ్రీహరి రావు దృష్టికి తీసుకెళ్లారు.



పన్నుల వసూళ్లపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్

రాయితీ పన్నుల చెల్లింపులకు మిశ్రమ స్పందన

● జిల్లాలో రూ.2.09 కోట్ల ముందస్తు పన్నుల వసూళ్లు

భైంసా, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై మున్సి పల్ కేంద్రాల్లో ముందస్తు పన్నుల చెల్లింపులకు కలిపించిన వెసులు బాటుకు జిల్లాలో మిశ్రమ స్పందన లభించింది. జిల్లాలోని మూడు మున్సిపల్ కేంద్రాల్లో ముందస్తు పన్నుల చెల్లింపులు, రాయితీని 4,510 మంది సద్వి నియోగపరుచుకున్నారు. ఫలితంగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కేంద్రాల్లో రూ.2.09 కోట్లు ముందస్తు పన్నులు వసూళ్లు అయ్యాయి.

● 5 శాతం రాయితీ

గత నెలలో ముందస్తు పన్నుల చెల్లింపు కోసం గాను రాష్ట్ర మున్సిపల్ శాఖ 5 శాతం రాయితీని కల్పించారు. 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా పన్ను చెల్లించడానికి ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు గడువు విధించారు. సంబంధిత విష యంలో మున్సిపల్ అధికార వర్గాలు విస్తృత ప్రచారం నిర్వహిం చాయి. ఇందులో భాగంగా నిర్మల్ మున్సిపల్ పరిధిలో రూ.1.51 కోట్లు, భైంసా మున్సిపల్ పరిధిలో రూ. 47 లక్షలు, ఖానాపూర్ ము న్సిపల్ పరిధిలో రూ.11 లక్షలు చెల్లింపులు జరిగాయి

● నిర్మల్ మున్సిపల్ పరిధిలో 2,865 మంది

నిర్మల్ మున్సిపల్ పరిధిలో మొత్తం 42 వార్డులు ఉండగా 24,676 నివాస గృహాలు ఉన్నాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ గత నెల లో 5 శాతం రాయితీపై ముందస్తు పన్నుల చెల్లింపులకు అవకాశం కల్పించింది. నిర్మల్ మున్సిపల్ పరిధిలో 24,676 నివాస గృహాలలో 2,865 మంది నివాస గృహాల యజమానులు రాయితీ పన్నుల చెల్లింపులను సద్విని యోగం చేసుకొని రూ.1.51 కోట్లు చెల్లింపులు చేపట్టారు

● భైంసా మున్సిపల్ పరిధిలో 1,098 మంది

భైంసా మున్సిపల్ పరిధిలో మొత్తం 26 వార్డులు ఉండగా 12,436 నివాస గృహాలు ఉన్నాయి. ఇందులో నుంచి 1,098 నివాస గృహాల యజమానులు రూ.47 లక్షల మేర రాయితీపై ముందస్తు ప న్నులను చెల్లించారు. గత సంవత్సరముతో పోల్చి చూస్తే ఇక్కడి మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరములో రాయితీ ముందస్తు పన్నుల చెల్లింపులను ఎక్కువ మంది వినియోగించుకున్నారు..

● ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 547 మంది..

ఇక ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 12 వార్డులు ఉండగా 6,905 నివాస గృహాలు ఉన్నాయి. ఇందులో 547 నివాస గృహాల యాజమానులు రూ.11 లక్షలు ముందస్తు పన్నులు చెల్లించారు.

ఆదిలాబాద్ మండల

టాపర్‌గా కల్యాణం రాజేశ్వరి



రాజేశ్వరి

ఆదిలాబాద్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలో 559 మార్కులు సాధించి కల్యాణం రాజేశ్వరి మండల టాపర్‌గా నిలిచింది. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆదిలాబాద్ రూరల్ మండల విద్యార్థులు 91 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో కంటే నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జడ్పీఎస్‌హెచ్ అంకోలికి చెందిన 63 మంది విద్యార్థులు పరీక్షా రాయగా 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణతలు సాధించారన్నారు. ఇందులో 5 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారన్నారు. ప్రథమ స్థానంలో కల్యాణం రాజేశ్వరి (559), ద్వితీయ స్థానంలో ఎ.అంజలి (549), తృతీయ స్థానంలో టి.నందిని(547),వై. యోగీత (542), ఈ.మహేశ్వరి (530)మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను హెచ్ఎం సిబ్బంది అభినందించారు.

'పది'లో టాపర్‌గా నిలవడం అభినందనీయం

● నైనారెడ్డిని అభినందించిన కాలనీవాసులు



పదవ తరగతి ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్‌గా నిలిచిన నైనారెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

నిర్మల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో 589 మార్కులు సాధించిన నైనా రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే టాపర్‌గా నిలవడం అభినందనీయమని నిర్మల్ పట్టణంలోని ఏఎంఆర్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్దినేని శ్రీధర్ రావు అన్నారు. అపార్ట్‌మెంట్‌లోనే నివసించే నల్ల లక్ష్మీ భూపాల్ రెడ్డిల కూతురు పదవ తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కన బరిచినందుకు గాను గురువారం నైనా రెడ్డితో పాటు వారి తల్లిదండ్రులను అపార్ట్‌మెంట్ వాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మా ట్లాడుతూ... కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఇలాంటి ఫలితాలు వస్తాయన్నారు. ఈ రోజుల్లో సెల్ ఫోన్, టీవీల కారణంగా విద్యార్థులు చదువుపై పెద్దగా దృష్టి సారించడం లేదన్నారు. అలాంటిది టీవీ చూడకుండా సెల్ ఫోన్ జోలికి వెళ్లకుండా కేవలం పుస్తకాలను చదవడం, రాయడం ద్వారా నైనా రెడ్డి పదవ తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. ఇప్పటి జనరేషన్‌కు ఆమె స్ఫూర్తి దాయకమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, కోశాధికారి పోతారెడ్డి, కార్యవర్గ సభ్యులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

● నైనా రెడ్డి, పది ఫలితాల్లో ఉమ్మడి జిల్లా టాపర్



నా కోసం అమ్మానాన్నలు పడుతున్న కష్టాన్ని కళ్లారా చూశాను. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా, మంచి విద్యను అందించడమే కాకుండా నా అవసరాలకు ఏ లోటు లేకుండా పెంచారు. నాపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్న ఉద్దేశ్యంతోనే చదువు పైనే దృష్టి కేంద్రీకరించాను. చిన్నప్పటి నుంచే పెద్ద లక్ష్యాన్ని పెట్టుకొని చదువుపై ఇష్టాన్ని పెంచుకోవడం వల్లే ఈ ఫలితాన్ని సాధించ గలిగాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో భవిష్యత్తులో ఐఐటీలో గ్రాడ్యు యేషన్ పూర్తి చేసి ఐఏఎస్ కావాలన్నదే తన ముందున్న ప్రధాన లక్ష్యమని నైనా రెడ్డి ఎంతో ఆత్మ విశ్వాసంతో చెబుతోంది.

విజయం సాధించాలంటే పట్టుదల అవసరం

● పదో తరగతి టాపర్లకు జిల్లా కలెక్టర్ అభినందన



పదవ తరగతి టాపర్లను సత్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కష్టపడితే ఏదైనా సాధ్యమని, విజయానికి పట్టుదలే పునాది అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల, ఖానాపూర్‌కు చెందిన జాదవ్ ఈశ్వర్ 561 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవగా, భూక్యా గౌతమ్ 558 మార్కులు సాధించి ప్రతిభను చాటాడు. గురువారం జిల్లా కలెక్టర్ విద్యార్థులను స్వయంగా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థుల విసయం గర్వించదగిన విషయమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషికి ఇది నిదర్శనమని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యావిధానం వల్లే ఈ ప్రతిభ వెలుగులోకి వచ్చిందని వివరించారు. ఈ ఫలితాలు జిల్లా యంత్రాంగానికి నూతన ఉత్తేజానిస్తాయని పేర్కొన్నారు. కష్టపడితే ఎలాంటి లక్ష్యానికైనా చేరుకోవచ్చని, జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలంటే పట్టుదలతో చదవాలంటూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సాహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, సీపీవో జీవరత్నం, వ్యాయామ ఉపాధ్యాయులు భూక్యా రమేష్, ఇతర ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వేసవి క్రీడా శిబిరాలు

● జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు ● బరంపూర్‌లో వేసవి క్రీడా శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు



పాల్గొన్న క్రీడాకారులు, విద్యార్థులు

తలమడుగు, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వేసవి క్రీడా శిబిరాలను ఏర్పాటు చేసిందని ఈ క్రీడా శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ క్రీడా పాఠశాల ఇంచార్జి వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామంలో వేసవి క్రీడా శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్ర భుత్వం ఈ క్రీడా శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. బరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వాలీబాల్, హాకీ ఇతర క్రీడలను నే ర్పించేందుకు నెల రోజుల పాటు ఈ క్రీడా శిబిరం నిర్వహించడం జ రుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ క్రీడా శిబిరాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామీణ యువజన సంఘాల ప్రజా ప్రతినిధులు, ఇతర శాఖ అధికారులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం వేసవి క్రీడా శిబిరాలను వారు ప్రారంభించారు. అదేవిధంగా బరంపూర్ పాఠశాలలో పదోతరగతి పరీక్ష ఫలితాలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూషను పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆదివాసీ పాఠశాలల క్రీడల శాఖ అధికారి పార్థసారథి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష, గ్రామ పెద్ద కేదా రేశ్వరరెడ్డి, రమాకాంత్, ప్రతాప్, నర్సయ్య, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ముథోల్‌లో సమ్మర్ క్యాంప్ ప్రారంభించిన ఎంఈవో

ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ముథోల్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు శారీరక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు వినూత్నమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఎంఈవో రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని ఆష్టా ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ క్యాంపులో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు క్రీడలు, సృజనాత్మక అభ్యాసాలు, శారీరక అభ్యాసాలు, విద్యాభివృద్ధి, పలు అభివృద్ధిపై నేర్పించనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆష్టా పాఠశాలలో సమ్మర్ క్యాంప్

తుల్జాపూర్ ఆలయానికి పాదయాత్ర

కుబీర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన జాదవ్ మాదవ్ రవ్ అనే ఆంజనేయ దీక్ష పరుడు గురువారం విఠలేశ్వర స్వామి ఆలయం నుండి తుల్జాపూర్ భవాన్ని ఆలయానికి కాలినకడక బయలుదేరారు. ముందుగా విఠలేశ్వరస్వామి ఆలయంలోని దేవతామూర్తులకు, ఆందజనేయ స్వామి విగ్రహానికి పూజలుచేసి బయలు దేరారు. ఆంజనేయ స్వాములు గ్రామస్తులు ఘనంగా సాగనంపారు. ఇంతకు ముందు కుబీర్ నుండి అయోద్య రామ మందిర ప్రారంభోత్సవానికి కూడా కాలినడకన బయలు దేరాడు. తుల్జాపూర్ భవాని మాత ఆలయానికి వారం రోజుల్లో చేరుకుంటానని పేర్కొన్నారు.



పాదయాత్రగా బయలు దేరిన ఆంజనేయ దీక్షాపరుడు మాధవ్, భక్తులు

ఆదిలాబాద్ మండల టాపర్‌కు సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

ఆదిలాబాద్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి జడ్పీఎస్ఎస్ విద్యార్థిని కల్యాణం రాజేశ్వరి 559 మార్కులు సాధించింది. గురువారం మండల టాపర్‌గా నిలిచిన రాజేశ్వరిను డీఈఓ శ్రీనివాసరెడ్డి సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో కంటె నర్సయ్య, ఉపాధ్యాయులు కానిందే అశోక్, విదా సాగర్ రెడ్డి, అంకోలి గ్రామస్థులు కల్యాణం కృష్ణ, శ్రీనివాస్, ఆదా నవీన్, భీమానవేణి లచ్చన్న, దుబ్బా రమణ పాల్గొన్నారు.

ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనం

కుబీర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణం అందించడంతో పాటు వనీకరణ పెంచేందుకు పల్లె ప్రకృతి వనాలతో పాటు మండలానికో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని జామ్‌గాం సమీపంలోని అటవీ ప్రాంతంలో బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేసి రూ. 50లక్షల వేచించి పలు రకాల మొక్కలు వేలాదిగా నాటారు. ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్, వనం చుట్టు పశువులు రాకుండా చుట్టి కంచే ఏర్పాటు చేసి కాపలగా ఓ కార్మికుడిని ఉంచారు. ఇప్పుడు చూస్తే అందుకు బిన్నంగా మారింది. ఎక్కడిక్కడ మొక్కలు ఎండిపోయాయి. పదుల సంఖ్యలో కూడా బ్రతికిన మొక్కలు కనబడటం లేదు. ఏర్పాటు చేసిన కంచె కనిపించకుండా పోయింది. వీటి నిర్వాహణ బాధ్యతలు పంచాయతీలకు అప్పగించారు. కాగా పంచాయతీ సిబ్బంది పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్, వనం చుట్టు పశువులు రాకుండా చుట్టి కంచే ఏర్పాటు చేసి కాపలగా ఓ కార్మికుడిని ఉంచారు. ఇప్పుడు చూస్తే అందుకు బిన్నంగా మారింది. ఎక్కడిక్కడ మొక్కలు ఎండి పోయాయి. పదుల సంఖ్యలో కూడా బ్రతికిన మొక్కలు కనబడటం లేదు. ఏర్పాటు చేసిన కంచె కనిపించకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనంతో మొక్కలకు నీరందిం పచ్చగా ఎదిగేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

విద్యార్థుల కోసం.. ఇంటింటా ప్రచారం

● కరపత్రాలు, బ్రోచర్ల పంపిణీ

● నిబంధనలు బేఖాతారు

సారంగాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల కోసం ప్రైవేటు పాఠశాలలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రవేశాల పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి. ఆ లక్ష్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు భారీ ఎండలో ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తున్నారు. తమ తమ పాఠశాలల ప్రత్యేకతలు, విశిష్టతలను వివరిస్తూ ఆకర్షణీయమైన బ్రోచర్లు, కరపత్రాలను పంచుతున్నారు. తమ పిల్లలకు తమ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు వేడుకుంటున్నారు. ఉదాహరణకు ఒక రకంగా చెప్పాలంటే ఈ పాఠశాలల ప్రచారం వ్యవహారం ఎన్నికల ప్రచారాల కంటే ఎక్కువగానే ప్రచారం నిర్వహిస్తున్నారు.

● ఉదయం నుంచి గ్రామాల్లో ప్రచారం

ఒక్కొక్క ఉపాధ్యాయునికి 5 నుంచి 15 మంది పిల్లలను చేర్పించాలంటూ ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలు టార్గెట్ విధించి పిల్లలను చేర్పించక పోతే వారు విధులు నిర్వహిస్తున్న వేతనాల విషయంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. దీంతో వివిధ ప్రయివేటు పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఉదయం నుండే గ్రామాల్లో తిరుగుతూ పాఠశాలలో పిల్లలను చేర్పించడానికి ప్రచారాన్ని మొదలు పెడుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో విద్యార్థులు తల్లిదండ్రులను కలిసి ప్రీ అడ్మిషన్ల పేరుతో బడులలో చేర్పించేందుకు వివిధ ప్రయత్నాలను చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇతర పాఠశాల కంటే తమ పాఠశాలలో ఫీజు రాయితీలను ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించేందుకు నానా తంటాలు పడుతున్నారు.

● ప్రభుత్వ నిబంధనలు భేఖాతరు

ప్రైవేటు పాఠశాలపై విద్యాశాఖ పర్యావేక్షణ కరువయ్యిందని ఆరోపణలు ఉన్నాయి. ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవోలు అమలు చేయక పోవడంతోనే పాఠశాలలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండల వాసులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో క్రీడా మైదానం , విశాల తరగతి గదుల తో పాటు విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు ఉండాలి. కొన్ని పాఠశాలల్లో విద్యార్హతలు లేని వారితో భోదన చేయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పాఠశాలలోనే విక్రయిస్తూ వేలకు వేల రూపాయలు వసూల్ చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. దీంతో బీఈడీ పూర్తి చేసిన వారే విద్యాభ్యాసం చేయాలనీ ప్రభుత్వ ఆదేశాల ఉండగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో కొనసాగుతున్న చాలా పాఠశాలల్లో విద్యార్హత లేన వారితో చదువులు కొనసాగించడంతో పాటు అధికంగా ఫీజులను వసూలు చేస్తున్నట్లు ప్రయివేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనేది ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

ఎంఈవో మధుసూదన్, సారంగాపూర్



ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కలల్పించాలి. నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

భైంసా రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటేగాం ప్రభుత్వ పాఠశాలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన పదవ తరగతి విద్యార్థులను గ్రామ వీడీసీ మెంబర్లు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామారావు మాట్లాడుతూ... మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రశంసించడం జరిగింది. ఇలాగే భవిష్యత్తులో విద్యార్థులందరూ మంచిగా చదువుకొని మంచి ఉద్యోగం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, వీడీసీ మెంబర్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో 'పది'లో 99.6 శాతం ఉత్తీర్ణత

● 582 మంది విద్యార్థులకు 580 మంది ఉత్తీర్ణత



శ్రీవాణి 588/600



అభిజ్ఞ, 586/600



వృచిత, 584/600



శ్రీనిధి, 578/600



వైశాలి, 573/600

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఖానాపూర్ మండలంలో 99.6 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. మొత్తం 582 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్ష రాయగా 580 మంది ఉత్తీర్ణులైనట్లు, ఇద్దరు విద్యార్థు ఫెయిల్ అయినట్లు ఆయన పేర్కొన్నారు. సత్తెనపల్లిలో ఒకరు, మస్కాపూర్‌లో ఒకరు మొత్తం ఇద్దరు విద్యార్థులు ఫెయిల్ కాగా మిగతా పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల పాఠశాలలో కే.శ్రీవాణి 588 మార్కులతో మండలంలో అత్యధిక మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అదే పాఠశాలలో చదువుతున్న మాదాస్తు వృచిత 584 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేటీఎస్ పాఠశాలలో వి.అభిజ్ఞ 586, ఏ.శ్రీనిధి 578, కే. వైశాలి 573, జే.వరుని 572 మార్కులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 129 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 56 మంది విద్యార్థులు 500ల పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ తెలిపారు.





మారుమూల పల్లెలకు శాపంగా అటవీ అనుమతులు

- జిల్లాలో కాలువలు, రోడ్లు, వంతెనల మరమ్మతులకు కవ్వాల్ నిబంధనలు బ్రేక్
- కడెం, సరస్వతీ కాలువల పరిస్థితి దయనీయం
- వర్షాకాలాన్ని తలుచుకొని భయపడుతున్న ఆదివాసీలు
- కాగితాలకే పరిమితమవుతున్న అధికారుల పతిపాదనలు

నిర్మల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కడెం ప్రధాన కాలువ మరమ్మతులకు అటవీ అనుమతులు శాపంగా మారుతున్నాయి. మొన్నటి భారీ వరదల కారణంగా అనేక చోట్ల కాలువకు భారీగా గండ్లు పడడం, అలాగే కాలువలో పిచ్చిమొక్కలు మొలవడం సమస్యగా మారింది. దీనికి తోడు పలు మారుమూల గ్రామాలను కలిపే వంతెనలు తెగిపోవడం, రోడ్లు చెడిపోవడం లాంటి విధ్వంసం చోటు చేసుకుంది. ఈ ప్రధాన కాలువ మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ కాలువ భూభాగమంతా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఉండడం ప్రధాన ఆటంకంగా మారింది. కాలువ లైనింగ్ పూర్తిగా భారీ వర్షాలతో ధ్వంసమైంది. ఈ కాలువ కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున మరమ్మతులకు అటవీశాఖ అనుమతులను నిరాకరిస్తుంది. 35 ఏళ్ల క్రితం ఈ కాలువ నిర్మాణానికి అటవీశాఖ అనుమతించినప్పటికీ ప్రస్తుతం ఏ మాత్రం మరమ్మతుల పనులకు కవ్వాల్ టైగర్‌జోన్ నిబంధనలు అడ్డు పడుతుండడం ఆటంకాలకు తావిస్తోంది. కాలువ లైనింగ్ పూర్తిగా ధ్వంసం అవ్వడం, అలాగే కాలువలో వరదల కారణంగా మట్టి పెద్ద ఎత్తున చేరుకోవడం, లైనింగ్ మధ్యలో పెద్దపెద్ద చెట్లు మొలవడం, పిచ్చి మొక్కలు విస్తరించడంతో ఈ కాలువ రూపురేఖలే మారిపోయాయి. అలాగే జిల్లాలోని మరో ప్రధాన కాలువైన సరస్వతీ కాలువ పరిస్థితి కూడా దయనీయంగానే మారింది. ముఖ్యంగా ఖానాపూర్ పరిధిలో కవ్వాల్ టైగర్‌జోన్ నిబంధనలు అమలవుతున్న కారణంగా ఈ కాలువకు మరమ్మతులు చేయలేకపోతున్నారు. మరమ్మతు పనులు జరగకపోవడంతో కడెం, సరస్వతి కాలువల నుంచి పంటలకు ఈసారి ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నీరందడం కష్టమేనంటున్నారు.

పసుపుల వంతెనపై స్పందన కరువు

మారుమూల పెంబి మండలంలోని పసుపుల వంతెన మొన్నటి వరదల కారణంగా పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ వంతెన ఇక్కడి ఆరు ఆదివాసీ గ్రామ పంచాయతీలకు ప్రధానరోడ్డు మార్గంగా ఉండేది. అయితే నాణ్యత లోపం కారణంగా మొన్నటి వరదలతో ఒక్కసారి కుప్పకూలిపోయింది. ఇప్పటి వరకు ఈ వంతెనను పునర్నిర్మించలేదు. దీంతో వర్షాకాలంలో ఆరు గ్రామాలకు రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయే ప్రమాదం ఉందంటున్నారు. ఈ వంతెన నిర్మాణానికి కూడా అటవీశాఖ అనుమతులు తప్పనిసరి అంటున్నారు. ఇప్పటి వరకు అటవీశాఖ మాత్రం పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణానికి అనుమతులను మంజూరు చేయలేదు. ఈ వంతెన నిర్మాణం ఇక ఇప్పట్లో సాధ్యం కాదంటున్నారు. అలాగే కడెం నదిపై నిర్మిస్తున్న వంతెన కూడా వరదల కారణంగా కొట్టుకుపోయింది. దీనికి కూడా అనుమతులు గాని టెండర్ ప్రక్రియ గాని పూర్తికాకపోవడంతో ఇక ఈ వర్షాకాలం మొదలయ్యే నాటికి పనులు పూర్తి కావడం అనేది అసాధ్యం అంటున్నారు. ఇదే జరిగితే చాలా ఆదివాసి గ్రామాలకు రాకపోకలు స్తంభించే అవకాశం ఉందంటున్నారు.

మారుమూల గ్రామాల రోడ్లదీ అదే పరిస్థితి

మొన్నటి వరదలు, వర్షాల కారణంగా జిల్లాలోని అనేక మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. అయితే కవ్వాల్ టైగర్ జోన్ నిబంధన ప్రకారం అటవీశాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో ఈ రోడ్ల మరమ్మతులు ఇప్పటి వరకు మొదలు పెట్టలేదు. ముఖ్యంగా పెంబి మండలంలోని రాంనగర్, దొందారి, వట్టపల్లి, గుమ్మెన, ఎంగ్లాపూర్, పసుపుల తదితర గ్రామాల రోడ్ల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా ఉంది. అయితే ఇప్పటి వరకు పనులు మొదలు కాకపోవడంతో ఈ వర్షాకాలంలో సైతం ప్రస్తుం రోడ్లపై నడవడం సాధ్యం కాదని అంటున్నారు.



పెంబిమండలంలోని దొత్తి వాగుపై వంతెన లేక వాగు దాటేందుకు అవస్థ పడుతున్న గిరిజనులు (ఫైల్)

గతంలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన నిర్మాణం పనులు (ఫైల్)

కార్మికుల న్యాయమైన హక్కుల కోసమే పోరాడాలి

జిల్లా న్యాయాధికారి రాధిక

నిర్మల్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల న్యాయమైన హక్కుల కోసమే పోరాడాలని జిల్లా జడ్జి రాధిక అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం రోజు టీయూసీఐ ఆధ్వర్యంలో జరిగిన మేడే సదస్సుకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జిల్లా జడ్జి రాధిక మాట్లాడుతూ.. ప్రభుత్వాలు 44 చట్టాలను నాలుగుకోడ్స్‌గా మార్చి 2020 సెప్టెంబరులో చట్టాలు తీసుకొచ్చాయన్నారు. కార్మికులు హక్కులు, బాధ్యతలు తెలుసుకొని పనిచేయాలని, కార్మిక ప్రయోజనాలు పొందాలని అలాంటి వాటికి తమ వంతు సహకారం పూర్తిగా ఉంటుందని తెలియజేస్తున్నాం. కార్మికులను విధుల నుంచి అనవసరంగా తొలగిస్తే యాజమానులపై చర్యలు తీసుకోవడానికి న్యాయ సహకారం అందిస్తామన్నారు. హక్కుల కోసం సంఘాల ద్వారా పోరాడి కార్మికులు హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షులు బక్కన్న, జిల్లా కార్యదర్శి రామలక్ష్మణ్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ, జిల్లా నాయకులు గంగామణి, రేష్మ, భీమవ్వ, ముత్తక్క, భూషణ్, గంగాధర్, పోశెట్టి, రాజేందర్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో తేడాలు వస్తే చర్యలు తప్పవు



కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

దస్తురాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం తూకంలో తేడాలు వస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి డీసీఎస్‌వో కోమల్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ అధికారులు, ఐకేపీ సిబ్బంది ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తప్పనిసరిగా 41.5 కేజీల ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. తూకంలో తేడాలు వస్తే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. గత మూడు రోజుల క్రితం రైతులను రైస్‌మిల్ యజమానులు వేధిస్తున్నారంటూ చేసి ఆరోపణలు నిరాధారమైనవన్నారు. రైతులను అయోమయానికి గురిచేసే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగునీరు, షామియానా, గన్నీసంచులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు వాతావరణ సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, డిప్యూటీ తహసీల్దార్ యాదవ్‌రావు, వ్యవసాయ విస్తరణ అధికారులు తిరుపతి, ఏపీఎం గంగన్న, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

తానూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భోల్సా గ్రామానికి చెందిన అక్కెం రమేష్(30) మద్యానికి బానిసై బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్న ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రమేష్ గత రెండు సంవత్సరాల విపరీతంగా మద్యానికి బానిసైయ్యాడు. దీంతో రెండు సంవత్సరాల క్రితం అతని భార్య ముధోల్‌లోని తన తల్లిగారింటికి వెళ్లి పోయింది. రమేష్‌కూడా తన భార్య దగ్గరికి వెళ్లి ఆరు నెలలు ఉన్నాడు. అయిన మద్యం వదల్లెదు. భార్య ఎన్ని సార్లు చెప్పిన వినిపించుకోలేదు. తన స్వంత గ్రామమైన భోల్సాకు వచ్చి బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కూతరు, ఒక కొడుకు ఉన్నారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

● డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

నిర్మల్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్మల్ నియోజకవర్గంలోని 43 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేస్తూనే, నిరుపేద రోజులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాంలో సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, నక్క మధుకర్‌రెడ్డి, బొల్లోజి నర్సయ్య, భుజంగ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, వివిధ ఆలయాల చైర్మన్లు గంగోని భూరాజ్, భోజగౌడ్, కొండ శ్రీనివాస్, సభా కలీం, అర్షద్, ఈటెల శ్రీనివాస్, వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన అడెల్లి ఆలయ పాలకవర్గం

మండలంలోని అడెల్లి గ్రామంలో గల మహాపోచమ్మ ఆలయ పాలకవర్గం గురువారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుని జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలు వాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. చైర్మన్ భోజగౌడ్, ధర్మకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఆదివారం భక్తులు అమ్మవారిని దర్శించు కునేందుకు పెద్ద సంఖ్యలో వస్తారని వారికి ఇబ్బందులు కలుగకుండా చూడా లని నూతన పాలకవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సయ్య, తది తరులున్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

కనకాపూర్ మాజీ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్ మాతృమూర్తి అనారోగ్యంతో పట్టణంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వీరి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

కులగణన చేస్తామన్న

ప్రధాని ప్రకటన ప్రజల్లో ఉత్సాహం నింపింది

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : దేశంలో జనగణనతో పాటు కుల గణన ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రకటన దేశ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మహేందర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కుల గణన పేరు మీద రాజకీయాలు చేస్తూ వచ్చిందే తప్పా ఏనాడు కూడా కుల గణన చేయలేదన్నారు. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ మీటింగ్‌లో జన గణనతో పాటు కుల గణనను నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. ఈ నిర్ణయంపై అన్ని కుల సంఘాల ప్రజలందరూ మద్దతుగా నిలిచి భారత ప్రభుత్వానికి, ప్రభుత్వ చట్టాలకు అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ టేకు ప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకులు నల్ల రవీందర్‌రెడ్డి, పి. అనిల్‌రావు, బొప్పారపు సత్యావతి, కంతి లింబాద్రి, ఎనగందుల రవి, బట్టు వరుణ్, పుప్పాల పవన్, కే. పోశెట్టి, బక్కశెట్టి వెంకట్రాములు తదితరులున్నారు.

సీఎంఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, రైస్‌మిల్లర్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సీఎంఆర్ సరఫరాలో ప్రతీ మిల్లరు గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుంచి రైస్ మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించాలంటే వారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ధాన్యాన్ని ప్రభుత్వానికి అందజేస్తామన్న ఒప్పందం చేసుకుంటేనే వారికి ధాన్యం కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా యాక్షన్ ప్యాడికి సంబంధించిన మిగిలిన మొత్తం వెంటనే డిపాజిట్ చేయాలని సూచించారు. రైస్ మిల్లులలో హమాలీల సంఖ్యను పెంచి మిల్లింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటి వరకు సరఫరా చేసిన సీఎంఆర్, మిగిలిన ధాన్యం, రోజువారీగా తరలిస్తున్న లారీల వివరాలను రైస్‌మిల్లుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు మిల్లుల్లో ధాన్యం నిల్వ, సామర్థ్యం, అన్‌లోడింగ్ పరిస్థితులు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, రోజువారీ నివేదికలు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, డీఎం సివిల్ సప్లయిస్ సుధాకర్, ఎల్డీఎం రామ్‌గోపాల్, పౌర సరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇతర శాఖలతో పోలిస్తే పోలీసు ఉద్యోగం గౌరవ ప్రదమైనది

● జిల్లా ఎస్పీ డా. జి. జానకీషర్మిల



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఇతర శాఖలతో పోలిస్తే పోలీసు ఉద్యోగం అనేది గౌరవ ప్రదమైనది, సవాళ్లతో కూడినది అని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకీషర్మిల జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల సిబ్బందితో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా కొత్తగా పోలీసుస్టేషన్‌కి పంపిన పరికరాల ఉపయోగం గురించి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ... నారీశక్తి, పోలీస్ అక్క ప్రోగ్రాంలో పాల్గొనే వారిని అడిగి తెలుసుకున్నారు. పోలీసుస్టేషన్లలో వాడే ప్రతి అప్లికేషన్‌ను ఎల్లప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని వివరించారు. మెన్, ఉమెన్ అని తేడా లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. గత నెలలో నిర్వహించిన మెడికల్ పరీక్షల్లో భాగంగా వైద్యులు సూచించిన సలహాలు పాటించాలని సూచించారు. దొంగతనాలు జరుగకుండా నైట్ పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, డ్రంగ్ అండ్ డ్రైవ్ మీద శ్రద్ధ వహించి రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. రహదారుల్లో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడటం ద్వారా చిన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. డ్యూటీలో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డుల కొరకు అప్లికేషన్ పంపమని తెలిపారు. నిర్మల్ పోలీస్ మీ పోలీస్ అనే నినాదంతో ప్రతి మాటలోను ప్రతి పనిలోను ప్రతి అడుగులోను మన పోలీస్ సిబ్బంది చూపించాలన్నారు. ప్రజలకు దగ్గరై నేరాలు చేయకుండా అవేర్నెస్ ప్రోగ్రాముల ద్వారా వారిని చైతన్యపరచాలన్నారు. ఈ సెట్ కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఐటీ, డీసీఆర్‌బీ, జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



అనుమతి లేని భవనాన్ని సీజ్ చేస్తున్న డీటీఎఫ్ బృందం

● మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ
● కోర్టు ఆదేశాలతో నిర్మాణంలో ఉన్న ఓ భవనం సీజ్

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలో చేపడుతున్న భవన నిర్మాణాలకు తప్పనిసరి అనుమతి తీసుకోవాలని లేనిచో చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని శివాజీ నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనాన్ని కోర్టు ఆదేశాలతో కమిషనర్ నేతృత్వంలోని డీటీఎఫ్ బృందం సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... తెలంగాణ హైకోర్టు ఆదేశానుసారం డీటీఎఫ్ కమిటీ సదరు భవనాన్ని సందర్శించి సీజ్ చేసిందని పేర్కొన్నారు. ఇటువంటి ఇబ్బందులు భవిష్యత్తులో తలెత్తకుండా ఉండాలంటే నూతన నిర్మాణాలు చేపట్టే వారు ఖచ్చితంగా మున్సిపల్ అనుమతి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సాయికిరణ్, భీమ సురేందర్, ఆర్ఐ నగేష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆరెంజ్ జోన్‌లోనే జిల్లా

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతుండడంతో జిల్లాలో వరుసగా మూడో రోజు అధికారులు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేవారు. గురువారం జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఖానాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలమవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖానాపూర్‌లోని శివాజీ నగర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఎస్‌హెచ్‌వో లక్ష్మీనారాయణ తెలిపిన కథనం ప్రకారం... శివాజీనగర్ కాలనీకి చెందిన జక్కుల ఇందూర్ రెండో కుమారుడు తరుణ్(24) ఇటీవల కాలంలో ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. కాగా అతని ప్రేమ విఫలం అవ్వడంతో జీవితంపై విరక్తి చెందిన తరుణ్ గురువారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి ఇందూర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌హెచ్‌వో లక్ష్మీనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హిప్నెల్లిలో ఒకరి అదృశ్యం

తానూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హిప్నెల్లికి చెందిన అవినాష్(30) అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఏఎస్సై నర్సింగ్ భాను తెలిపాడు. వివరాల ప్రకారం... అవినాష్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన హిప్నెల్లికి వచ్చి 28వ తేదీన హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం చేశాడు. అయితే అవినాష్ తమ్ముడు ఆకాష్ అదే రోజు ఫోన్ చేయగా కామారెడ్డిలో ఉన్నానని, చెప్పగా తరువాత ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. హైదారాబాద్‌లోని అవినాష్ భార్యకు ఫోన్ చేయగా ఇంకా రాలేదని చెప్పడంతో, కుటుంబీకులకు, స్నేహితులకు ఫోన్ చేయగా ఆచూకీ తెలియలేదు. ఎన్ని సార్లు ఫోన్ చేసిన స్విచ్ఛాఫ్ రావడంతో గురువారం అవినాష్ తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ధాన్యం లారీ బోల్తా



బోల్తా పడ్డ ధాన్యం బస్తాల లారీ

భైంసా రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామ సమీపంలో గురువారం వడ్ల లారీ బోల్తా పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మణచాంద మండలం నుంచి లోకేశ్వరం మండలానికి వెళ్తున్న వడ్ల లారీ దేగాం గ్రామమలుపు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లకు తీవ్రగాయాలు కాగా ఏరియా ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా ఇక్కడ ప్రమాదాలు జరిగాయని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.